నేడు

సి.వి. సర్వేశ్వరశర్మ
కుమారి చావలి శ్రీవాగ్దేవి

రంగారావు వీధి గదిలో తన టేబుల్ ముందు కూర్చొని ఏదో రాసుకుంటున్నాడు. కాంపౌండు గేటు తీసిన చప్పుడయితే తలెత్తి చూశాడు. సీసా ఒకటి పుచ్చుకుని ఒకామె లోపలకు వస్తోంది. రంగారావు ఆలోచనకు ఆమె ఎవరో అంద లేదు.

ఆమె గుమ్మంలో నుంచుంది.

"ఏం కావాలి?" అన్నట్లు రంగారావు చూశాడు.

"సెప్టిక్ లెట్రిన్ ప్లేట్లు క్లీన్ చేసుకునే యాసిడ్ తీసుకుంటారేమోనని...." ఆమె అంది.

"మీరు తీసుకు వచ్చా రేమిటి?" రంగారావు ఆశ్చర్యంతో ప్రశ్నించాడు.

"నేను సేల్సు గరల్‌ని. మా కంపెనీ ఈ యాసిడ్‌ని కొత్తగా తయారు చేస్తోంది. మార్కెట్‌లో దీని గురించి బాగా తెలియడం కోసం ఇంటింటికి వెళ్లి అమ్ముతున్నాం" ఆమె అంది.

రంగారావుకు ఎంతో సంతోషం అయ్యింది. చాలా కాలంగా ఒక సేల్సుగరల్‌ని ఇంటర్వ్యూ చేయాలను కుంటున్నాడు. అవకాశం ఇంటికి వచ్చింది. తన పని తరువాత చేసుకో వచ్చు ననుకున్నాడు.

"రండి! అలా కుర్చీలో కూర్చోండి" రంగారావు ఆహ్వానించాడు.

"కూర్చుంటే, ఎలాగండి! మేము త్వర త్వరగా మా పని పూర్తి చేసుకుని నలుగుర్ని కలసి వెళ్లి పోవాలండి" ఆమె అంది.

"సీసాలు రెండు నేను కొంటాను" రంగారావు అన్నాడు.

ఆమె ముఖంలో ఆనందం రంగారావు గుర్తించాడు. ఆమె గది లోకి వచ్చి రంగారావు ముందున్న టేబుల్ మీద సీసా ఉంచింది. రంగారావు కూర్చున్న గదిలో ఎక్కడ చూసినా పుస్తకాలు.

"కూర్చోండమ్మా" ఆమెకు కుర్చీ చూపించాడు.

ఆమె "ఫర్వాలేదండి" అంటోంది. అయినా పైన తిరుగుతున్న ఫ్యాన్ గాలికి శరీరంలో అలసట బయటకు వచ్చినట్లయి ఆ కుర్చీలో అప్రయత్నంగా కూర్చుండి పోయింది.

"కొంచెం మంచి నీళ్లు కావాలా?" రంగారావు అడిగాడు.

ఆమె ఆశ్చర్యంగా రంగారావు కేసి చూసింది. నలభయి సంవత్సరాల వయస్సు గల రంగారావు కళ్లల్లో ఆమెకు ఏ విధమైన దోషం కన్పించినట్లు లేదు. మంచినీళ్లు కావాలని తలూపింది.

రంగారావు ఇంట్లోకి వినిపించేటట్లు గట్టిగా అన్నాడు.

"దేవీ: మంచినీళ్లు తీసుకురా"

"మీది ఏ ఊరు?" రంగారావు అడిగాడు.

"పాలకొల్లు" ఆమె చెప్పింది.

"పాలకొల్లులో కొత్తగా పెట్టారా ఈ కంపెనీ" రంగారావు ప్రశ్నించాడు.

ఆమె కొంచెం అయిష్టంగా కన్పించింది. "ఎండలో వచ్చారు కదా! కొంచెం సేద తీర్చుకోండి." రంగారావు మాటల్లో ఆమెకు ఏదో ఆప్యాయత అభిమానం కన్పించాయి.

గుమ్మం తెర తొలగించుకుని పద్దెనిమిదేళ్ల దేవి మంచి నీళ్లు తీసుకుని వచ్చింది. రంగారావు సైగను అర్థం చేసుకుని దేవి ఆమెకు మంచి నీళ్లు ఇచ్చింది. ఆమె మంచి నీళ్లు తాగింది.

"దేవీ! అమ్మను కాఫీ ఇమ్మను. ఈవిడ చాలా అలసినట్లు కన్పిస్తున్నారు" రంగారావు మాటలకు సేల్సు గరల్ "వద్దండి! నేను వెళ్లి పోతాను" అంది.

"రెండు నిముషాల్లో కాఫీ తయారవుతుంది. మీరు ఇంటికి వెళ్లేసరికి ఎంత టైము అవుతుందో తెలియదు కదా!" రంగారావు అన్నాడు.

ఆమె మాటాడలేదు. నిజానికి ఆమెకు కాఫీ తాగాలనివుంది. కాని పరిచయం లేనిచోట కాఫీలు తాగి కొత్త సమస్యలు సృష్టించుకోవడం ఆమెకు నచ్చదు. శరీర పరిస్థితి తన అభిప్రాయాలకు అతీతంగావుంది. ఆమె తన భావాలు బయటకు కనబడనివిధంగా గంభీరంగా కూర్చుంది.

"మీ పేరు?" అడిగాడు.

"మీరు యిన్ని ప్రశ్నలు వేస్తున్నారు. మీకు ఏమికావాలి. సరుకా? నా వివరాలా?" ఆమె సూటిగా అడిగింది.

రంగారావు నివ్వెరపోయాడు. తన ఆలోచనలో తనువున్నాడు. ఆమెకు తన అభిమతం చెప్పాలనుకున్నాడు.

"మీరు అలా కోపగించి మాట్లాడనవసరంలేదు. నేను ఒక రచయితను. మగవాడితో సమానంగా అన్నిరంగాల్లోను స్త్రీ ముందుకు వస్తోంది. స్త్రీ శక్తిని సమాజం గుర్తించింది. కాగితాలమీద ఊహలతో రాసే విషయాలకన్నా, ప్రత్యక్షంగా మీ అనుభవాలు విని వాటిని పాఠకులకు అందించాలని నా కోరిక" రంగారావు అన్నాడు.

"ఏమి అందిస్తారు? ఒక స్త్రీ యింటింటికి వెళ్లి యాసిడ్ సీసాలు అమ్మగలదనా?" ఆమె అడిగింది.

గేటు తీసిన చప్పుడయింది. రంగారావు అటు చూశాడు. మరొకామె గేటు తీసుకుని లోపలకు వచ్చింది. "అక్కా! ఇక్కడ కూర్చుండిపోయా వేమిటి?" ఆమె అంది.

రంగారావుకు విషయం అర్థమయ్యింది. "రండి లోపలకు. అలా కూర్చోండి" మరొక కుర్చీ చూపించాడు.

"వెళ్ళిపోదాం బయలుదేరు" చెల్లి అంది.

"కాఫీ తాగి వెడుదురుగాని" రంగారావు అన్నాడు.

"వీరు రచయితట. నా వివరాలు అడుగుతున్నారు. పాఠకులకు నా అనుభవాలు చెబుతారట!" అక్క అంది.

"అవునండి. మీరు ధైర్యంగా పొరుగూళ్ళు వెళ్లి సేల్సు చేస్తున్నారు. ఒంటరిగా స్త్రీలు ప్రయాణంచేసి, వ్యాపారం చేసే స్థాయికి మన దేశ నాగరికత ఎదిగిందంటే మనం స్వతంత్రం వచ్చిన తరువాత ఎంత పురోగమించామో అంచనా వేయలేకపోతున్నా" రంగారావు అన్నాడు.

"ఎంతమంది స్త్రీలు వ్యాపారం చేయటంలేదు. చేపలు అమ్మే స్త్రీలు ఎందరో ఒంటరిగా బస్సులమీద ప్రయాణం చేస్తూ, వ్యాపారం అనాదిగా చేస్తున్నారు. అందులో కొత్త ఏముంది?" చెల్లి అంది.

"ఆ వ్యాపారం వేరు. వారు కలసి వ్యాపారానికి ఒకచోటు నుండి మరొకచోటుకు వెడుతుంటారు. అలవాటు ఊళ్ళకే వెడతారు. మీరు అలాకాక కొత్తకొత్త ఊళ్ళకు, పరిచయంలేని యిళ్ళకు వెళ్లి సేల్సు కొనసాగించడం..... ఎందుకో నాకు కొత్త విషయంగా అన్పిస్తోంది. మన ప్రగతికి యిదొక ప్రతీకగా తోస్తోంది" రంగారావు అన్నాడు.

"మా అనుభవాలు తెలుసుకుని రాస్తే ఏమిటి లాభం?" చెల్లి అడిగింది.

"మీ అనుభవాలు యితరులకు మార్గదర్శకం

కావచ్చు. లేదా సామాజిక చైతన్యానికి ఉపయోగపడవచ్చు" రంగారావు అన్నాడు.

అంటే?" చెల్లి అడిగింది.

"నిరుత్సాహంతో నీరుకారిపోయే కొంతమందికి మీ అనుభవాలు వారి కొత్త జీవితానికి ఆశలు కల్పించవచ్చు లేదా కొన్ని సంఘటనలు మనిషి మనసును కదలించి అతని లేదా ఆమెలోని పైశాచిక ప్రవృత్తికి స్వస్తి చెప్పించవచ్చు" రంగారావు అన్నాడు.

"మీరు చాలాబాగా చెప్పారు అయితే ఈ స్వార్ధపూరిత సమాజంలో ఎవరిబ్రతుకుతెరువు వారే చూసుకుంటున్నారుగాని సామాజిక బాధ్యత నెత్తిన పెట్టుకునేవారు ఎవరువుంటారనుకున్నాను. రచయిత డబ్బుకోసం రచనలు అమ్ముకుంటాడనుకున్నాను" చెల్లి అంది.

రంగారావు ఆమెను పరిశీలనగా చూశాడు. ఇరవై ఆరు సంవత్సరాల వయస్సు వుంటుంది. ఎంతో నాజూగ్గావుంది. అందం ఆమె ముఖంలో తాండవిస్తోంది. అక్క వయస్సు యిరవై ఎనిమిది వుంటాయి. వయసులో చిన్నదయినా ఆమె ముఖంలో అందం ప్రక్కన వయసుకు మించిన అనుభవాలు వున్నట్లు రంగారావుకు అన్పించింది.

"మీ పేరు?" రంగారావు అడిగాడు.

"రేవతి" ఆమె చెప్పింది.

"వయసుకు మించిన అనుభవంతో మాట్లాడుతున్నారు. మీ అభిప్రాయాలు తమాషాగా వున్నాయి" రంగారావు అన్నాడు.

"దేశాన్ని పాలించే నాయకులే అవకాశం దొరికితే పెద్ద నాయకుడిని గద్దెదించాలనే ఆలోచనలతో వుంటున్నారు. జాతీయ సమైక్యతాభావం అని ఉపన్యాసాలు యిస్తూ, దేశాన్ని రక్షించేందుకు గట్టి నాయకుడు కావాలనే మాట మారుస్తూ స్వార్ధంతో తమ జేబులు నింపుకునే ధోరణితో ఈ దేశం ఎటుపోతే మన కెందుకులే అని ప్రవర్తించే రాజకీయనాయకులే స్వీకరించని బాధ్యత రచయిత స్వీకరించగలడా?" రేవతి ఆవేశంగా అంది.

"మీ ఆవేదన చాలు చైతన్యానికి. అయితే మీ ఆవేదన పదిమందికి తెలియాలి. మీ ఆవేదన, ఆవేశం, అనుభవాలు ప్రజలను ఆలోచింపజేసేవిగా ప్రయోగించాలి. ఆదే రచయిత బాధ్యత" రంగారావు అన్నాడు.

"అక్కా! నీ విషయం పూర్తిగా చెప్పు. ఈయన చెప్పినట్లు యితరులకైనా ఉపయోగిస్తుంది" రేవతి చాలా ఆవేశంతో అంది.

"మీ పేరు?" రంగారావు అడిగాడు.

"కాత్యాయని" ఆమె చెప్పింది.

"నువ్వు చెబుతావా? నేను చెప్పనా?" రేవతి కాత్యాయనికేసి చూసి అడిగింది.

దేవి కాఫీ తీసుకువచ్చింది.

"ముందు కాఫీ తాగండి. తర్వాత మాట్లాడుకుందాం" రంగారావు అన్నాడు.

★ ★ ★ ★ ★

"ఇప్పుడు చెప్పండి" రంగావు అడిగాడు.

"మా అక్క చెప్పదు. నేను చెబుతాను వినండి. మా బావ తాగుబోతు. మా అక్క కష్టపడి డబ్బులు సంపాదించి ఆతనికి యివ్వాలి. అతడు తాగుడుకి డబ్బు యివ్వకపోతే తన్నుతాడు" రేవతి చెప్పింది.

రంగారావు నమ్మలేకపోతున్నాడు. కాత్యాయని ఎంతో ఆకర్షణీయంగా, హుందాగా వుంది. పైగా ఆమె చదువుకున్న స్త్రీలా కన్పిస్తోంది. తనూహించింది నిజమయితే, భర్తను అదుపులో వుంచుకోలేదా?

"మీరు చెబుతున్నారు కాబట్టి నమ్మాలి. మీ అక్క చదువుకున్నట్లు కన్పిస్తున్నారు పెళ్ళయి ఎన్నాళ్ళయింది?"

"మా అక్క యింటర్ చదివింది. పెళ్ళయి పది

ఏళ్ళయింది మా అక్క జీవితం పెళ్ళితో కష్టాల్లోకి వెళ్ళిపోయింది రేవతి చెబుతూంటే, కాత్యాయని వింటోంది

"దగ్గర సంబంధమా?" అడిగాడు

'కాదు అదొక దురదృష్టం మా అక్కను ప్రేమించి మా బావ పెళ్ళిచేసుకున్నాడు' రేవతి చెప్పింది

రంగారావులో ఆసక్తి మొదలయింది "వీరిద్దరికి అసలు పరిచయం ఎలా జరిగింది?

'మా కుటుంబం పాలకొల్లు నుండి విజయవాడకు మారింది అప్పటికి అక్క యింటర్ పరీక్షలు రాసింది విజయవాడలో మేము అద్దెకు వుంటున్న యింటిలో మరొక వాటాలో మా బావ తల్లి దండ్రులతో వుండేవాడు మా అక్క అందానికి అతడు యిష్టపడి ప్రేమించాడు

మీ అక్క   రంగారావు అర్థోక్తి ఆగాడు.

"మా అక్క ఎటువంటి ఆలోచనా లేదు. మా కుటుంబం వివరాలు తెలుసుకుని మా అమ్మగార్ని అడిగాడు "

ఏమని?

"మీ కాత్యాయనిని నేను పెళ్ళిచేసుకుంటాను "

మా బావ మంచివాడని గుర్తించిన మా అమ్మ ఈ పెళ్ళికి వెంటనే ఒప్పుకుంది గుళ్ళో పెళ్ళిచేసుకుని యింటికి వచ్చారు ఆ తర్వాత మొదలయింది గొడవ మా బావ తల్లిదండ్రులకు ఈ సంబంధం యిష్టంలేదు కొన్నిరోజుల్లో గొడవ సర్దుకు పోతుందనుకున్నాము కాని కొత్తకొత్త సమస్యలు మొదలయ్యాయి

మీ నాన్నగారు   ' రంగారావు ఏదో అనబోయాడు

"మానాన్నగారే వున్నారు మా అమ్మకు నాన్నగారికి ఎలాంటి పేచీలు లేవు మధ్యమధ్య మా యింటికి వచ్చి మా మంచి చెడలు తెలుసుకుంటారు" రేవతి అంది.

రంగారావుకు రేవతి చెప్పేవిషయాలు వింటూంటే మనుషుల జీవితాలవెనుక కన్పించని ములువులు ఎన్నో వుంటాయన్పిస్తోంది.

"మీ నాన్నగారు ఏమిచేస్తూవుంటారు?"

'మా నాన్నగారు టీచర్ ఆయన చాలా మంచివారు రెక్కలే ఆధారం మేము పాలకొల్లులో, వుండేవాళ్ళం మా నాన్నగారి జీతం మా కుటుంబ పోషణకు సరిపడేదికాదు ఆయనకు తెలియకో, సరియైన సలహా యిచ్చేవారు లేకపోవడం వల్లనో మా అమ్మా నాన్నలు ఎనమండుగురు సంతానానికి తలితండ్రులైపోయారు" కాత్యాయని మాటల్లో ఎంతో నిదానంవుంది ఆవేశంలేదు

రంగారావు, రేవతి కాత్యాయనికేసి చూస్తున్నారు ఆమె చెబుతోంది.

'కుటుంబ పోషణకోసం అమ్మ డబ్బు సంపాదించాల్సివచ్చింది. అమ్మ చదువుకోలేదు. విజయవాడ వచ్చి వంటలు చేయడం మొదలు పెట్టింది నాన్న కొంత డబ్బు పంపించడం మొత్తంమీద సంసారం దొర్లేది."

"ఇలాంటి యిబ్బందిలో నన్ను పెళ్ళి చేసుకుంటానని మావారు ముందుకు వచ్చేసరికి, సంసార భారం కొంత తగ్గుతుందని మా అమ్మ ఒప్పుకుంది మా నాన్నగారికి యిలాంటి విషయాల్లో కలుగజేసుకునే చాకచక్యంలేదు "

రంగారావు ఆలోచనలో పడ్డాడు తండ్రి టీచర్ అటువంటప్పుడు కుటుంబాన్ని అలా ఎలా వదిలేశాడు మరి ఆ తండ్రి ఎక్కడ టీచరో? బహుశా ప్రయివేటుగా చదువుచెప్పే టీచరు అయ్యి వుండవచ్చు అసలువిషయం వినాలని ఆమెకేసి కుతూహలంగా చూశాడు

"మీ భర్త పెళ్ళినాటికే తాగుడు అలవాటు వుండేదా?" రంగారావు అడిగాడు



నా భర్తకి పెళ్ళినాటికి ఏవిధమైన దురలవాట్లు లేవు ఉద్యోగం చేసేవారు. పెళ్ళయిన వెంటనే ఉద్యోగం పోయింది" కాత్యాయని చెప్పింది.

"ఏదైనా తప్పుడుపని చేశాడా?" రంగారావు ప్రశ్నించాడు

"నా భర్త ఒక ప్రయివేటు కంపెనీలో పనిచేసేవారు ఆయన ఉద్యోగం పట్టణంలో అన్ని షాపుల్లోకి వెళ్ళి కంపెనీ సరఫరాచేసిన సరుకు బాపతు సొమ్ము అడిగి తీసుకురావాలి."

"ఈ ఉద్యోగం డబ్బుతో ముడిపడివుందికాబట్టి, కంపెనీకి కొంత సొమ్ము ధరావత్తు కట్టాలి లేదా కొంచెం పలుకుబడి గలవారు హామీ వుండాలి. చాలా కాలం ఈ ఉద్యోగం మా మామగారు చేశారు ఆయన పలుకుబడిమీద నా భర్తకు ఉద్యోగం యిచ్చారు.'

'తల్లిదండ్రులను కాదని నా భర్త నన్ను పెళ్ళిచేసుకోవడంతో కంపెనీవారికి కొడుకు విషయంలో తనకు సంబంధం లేదని నా మామగారు చెప్పారు. నా భర్త ఉద్యోగం పోయింది "

'పెళ్ళి చేశాం నీ గొడవ నువ్వు నీ భర్తా చూసుకోవాలి. నేను ఏమీ చేయలేను మా అమ్మ ఖచ్చితంగా చెప్పేసింది రోజు ఎలా గడుస్తుంది? ఆకలి తట్టుకోలేంకదా! కాయకష్టం చేయడానికి సిద్ధపడలేము ఒక ఫ్యాన్సీ దుకాణంలో సేల్సుగరల్ ఉద్యోగం సులువుగా దొరికింది నన్ను చూడగానే ఉద్యోగం యిచ్చాడు "

'మీ భర్త అంగీకరించారా?" రంగారావు అడిగాడు.

"ఏమిచేస్తారు బ్రతుకుతెరువు జీతం తక్కువ ఎక్కువ సమయం దుకాణంలో వుండాలి." కాత్యాయని చెప్పింది

"మీ భర్త ఉద్యోగంకోసం ప్రయత్నించారా? రంగారావు అడిగాడు

"ప్రయత్నించారు అనుభవం అడిగినపుడు పాత కంపెనీలో పనిచేసిన మాట చెప్పేవారు ఎందుకు ఆ ఉద్యోగం మానేశారు? వాళ్ళు ఎందుకు మిమ్మల్ని తీసేశారు? అడిగేవారు నా భర్త చెప్పిన సమాధానాలు వారికి నచ్చేవికాదు మాకు హామీ ఏమిటి? ఈవిధంగా ఉద్యోగం రాలేదు '

"సమయాన్ని మీ భర్త ఎలా గడిపేవారు?' రంగారావు ప్రశ్నించాడు

ఇంటిపని ఆయన చేసేవారు వంటచేసి నన్ను చూసి ఎంతో బాధపడేవారు 'పెళ్ళిచేసుకుని నిన్ను సుఖపెట్టడానికి బదులు నీ సంపాదనతో బ్రతుకుతున్నాను' అని ఎంతో మానసికంగా నలిగిపోయేవారు. నాకు తోచిన ధైర్యం నేను చెప్పేదాన్ని" కాత్యాయని చెపుతుంటే రేవతి మధ్యలో అంది –

"మా బావ మంచి ధైర్యం గలవాడు ఏమాత్రం ఆధారం దొరికినా తన కుటుంబాన్ని తాను

పోషించుకునేవాడు ఆర్థికంగా ఏమాత్రం బలంలేదు అక్క జీతంరాళ్ళు ఆధారం. ఆ జీతమైనా అంతంతమాత్రం. వయసులో వున్న బావకు డబ్బు లేదుగాని కోరికలు, సరదాలు చచ్చిపోవుకదా ఖాళీగా ఉండడంవల్ల స్నేహితులు తయ్యారయ్యారు. వాళ్ళతో సినిమాలకు వెళ్ళేవాడు'

రేవతికేసి కాత్యాయని కోపంగా చూసింది

ఎందుకు అలా కోపంగా చూస్తావు ఉన్నమాటే చెబుతున్నాను మొగుడు ఎంత హింసించినా అతడిని ఎవరూ ఏమి అనడానికి వీలు లేదంటుందండి ఈ మహా యిల్లాలు" రేవతి మాటలకు కాత్యాయని మౌనంగా తలవంచుకుంది

చిల్లరఖర్చులకు మీ బావ ఏమైనా సంపాదించు కునేవారా? రంగారావు అడిగాడు

మొదట్లో స్నేహితులు తీసుకువెళ్ళేవారు వాళ్ళకి అన్నీ దురలవాట్లే మా బావకు మెల్లిగా తాగుడు అలవాటు అయ్యింది మొదట్లో చాలా భయపడేవాడు తర్వాత తర్వాత త్రాగేసి యింటికి వచ్చేవాడు మా అక్క కళ్ళు తెరచి ఎందుకు యిలాంటిపనిచేస్తున్నారని? అడిగేసమయానికి అతడు వ్యసనానికి బానిస అయిపోయాడు.

మనిషికి ఏదో వ్యాపకం వుంటే మరొక ఆలోచన లేకుండా, ఆ వ్యాపకంలోపడి వుంటాడు ఆర్థికసోమత, మనోధైర్యం లేకపోతే వివేకం కోల్పోయి, తన ఉనికిని తనే మర్చిపోయేస్థితికి మనిషి రావడంలో ఆశ్చర్యం ఏముంది?" రంగారావు అన్నాడు

"మీరు చెప్పింది నిజమే. ఇటు నా తల్లిదండ్రులు అటు ఆయన తల్లిదండ్రులు మా మంచిచెడ్డలు పట్టించుకోనిస్థితిలో వదిలేశారు మాజీవితాంతం నడిసముద్రంలో చుక్కాని లేని నావలా తయారయ్యింది అనుభవంలేని నేను జీవితాన్ని ఎలా సరిదిద్దుకోగలను?' కాత్యాయని ప్రశ్నార్థకంగా అంది

మా అక్క బావని చేజేతులా యిప్పటికీ పాడుచేస్తోంది రోజూ తాగేందుకు డబ్బులు యిస్తుంది బావ తాగి వస్తాడు ఇంటికి వచ్చి అక్కను కొడతాడు రేవతి ఆవేశంతో తన ఆవేదనను వెళ్ళబోస్తోంది

రేవతి మాటలు కాత్యాయని అయిష్టంగా వింటోంది

ఫ్యాన్సీ దుకాణం నుండి ఈ యాసిడ్ కంపెనీలోకి ఎలా వచ్చారు?" రంగారావు టాపిక్ మార్చడానికి ప్రయత్నిస్తూ అడిగాడు

"జీతం మొదట్లో సరిపెట్టుకునేందుకు ప్రయత్నించేవాళ్ళం. కాని ఖర్చులు, ఖరీదులు పెరగడంతో మరొక ఉద్యోగం చేయాల్సి వచ్చింది. ఫ్యాన్సీదుకాణం ఎదురుగా యాసిడ్ తయారుచేసే కంపెనీలో సేల్సుగరల్ నందినితో పరిచయం అయ్యింది ఆమె నన్ను ఆ కంపెనీలో జేర్పించింది

"జీతం బాగావచ్చేదా? రంగారావు అడిగాడు

"జీతంలో మార్పులేదు కాని సీసాలు అమ్మినందుకు అదనంగా కమీషన్ యిచ్చేవారు జాగ్రత్తగా కంపెనీని కనిపెట్టుకుని ఉద్యోగం చేయడం వల్ల యాసిడ్ ఎలా తయారుచేస్తారో కిటుకు తెలుసుకున్నాను తక్కువ పెట్టుబడితో ఈ వ్యాపారం చేయవచ్చునని ఆలోచనవచ్చింది కాత్యాయని చెబుతోంది

అవసరం అన్వేషణకు ప్రాతిపదిక బ్రతుకు తెరువుకోసం ఏదో ఒక మార్గం కాత్యాయని గొప్పవ్యక్తి నైతికంగా దిగజారకుండా తన సంసారాన్ని గుట్టుగా చేసుకుంటున్న స్త్రీ మూర్తి ఆమెలో ఎంతటి వినయం, ఎలాంటి ఆలోచనలు వున్నాయి" రంగారావు ఆలోచిస్తున్నాడు



మా అక్క సంపాదన మా బావ తాగుడుకు అంకితం పగలు యాసిడ్ సీసాలు అమ్మి డబ్బు సంపాదించి అలసిపోతుంది ఇంటికి వెళ్ళేసరికి డబ్బు కోసం బావ ఎదురుచూస్తూ వుంటాడు బావకి డబ్బులుయిస్తుంది తాగుడు రాత్రి ఏదో సమయంలో యింటికి వస్తాడు అక్కను కొడతాడు అక్క ఏడుస్తుంది మేము భరించలేము" రేవతి తన అక్క బలహీనత దీనికి కారణం అంటుంది'

కాత్యాయని ముఖంలో ఆందోళనలేదు ప్రశాంతంగావుంది ఆమె గంభీర స్వభావం గలది

"అక్కకి మానసిక సౌఖ్యం, శారీరక సుఖం రెండూలేవు. ఏనాడో గుళ్ళో అయిన పెళ్ళికి విలువ అంటుంది ఈ నరకం నుండి బయటకు రావడానికి ఒకటే మార్గం బావను విడిచిపెట్టెయ్యమన్నాను అక్క ఒప్పుకోవటంలేదు రేవతి నిక్కచ్చిగా తన అభిప్రాయం చెప్పేసింది కాత్యాయని మౌనంగా వింటోంది

"రేవతిగారు చెప్పినట్లు ఎందుకు చేయలేక పోతున్నారు మీకు అభ్యంతరం లేకపోతే చెప్పండి" రంగారావు అన్నాడు

కాత్యాయని రంగారావుకేసి సాలోచనగా చూసింది

'తెలియని వయసులో పరిచయం లేని వ్యక్తితో నా యిష్టా యిష్టాలతో ప్రమేయంలేకుండా పెళ్ళిచేశారు నా వునికి నేను తెలుసుకునేసరికి పరిస్థితులు నా చేయి దాటిపోయాయి ఫలితం నేను అనుభవిస్తున్నాను ప్రపంచం కొంత అవగాహన అయిన నేను ఏదైనా ఒక నిర్ణయం తీసుకుంటే యింతకంటే దారుణమైన ఫలితాలు అనుభవించ వలసివస్తే ఏమిచేయ్యాలి? కాత్యాయని అడిగింది

అక్క భయంగాని, భర్త పెట్టే హింసలను భరించలేక ఎంతమంది విడాకులిచ్చి సుఖపడటం లేదు అక్క అదృష్టం ఎల్లలు కూడాలేరు చక్కగా తన జీవనం తను సాగించవచ్చు ఇలాంటివారికి రక్షణ కల్పించే స్వచ్ఛంద కేంద్రాలు కూడా వున్నాయి రేవతి ఆలోచనలు చెబుతోంది

"దూరపు కొండలు నునుపుది దగ్గరకు వెడితేకాని కన్పించవు ఎత్తు – పల్లాలు ఎక్కడ వుండే సమస్యలు అక్కడ వుంటాయి' కాత్యాయని తల వొంచుకుని అంది

యాసిడ్ సీసాల్లో పోసేందుకు కావలసిన సీసాలు తెచ్చుకునేందుకు అక్క వంటరిగా రాత్రి సమయాల్లో కూడా బ్రాందీ షాపుల్లోకి వెళుతుంది వంటరిగా రాత్రి సమయాల్లో ప్రయాణం చేస్తుంది ఇంకా ఏవేవో సమస్యలని భయపడుతుంది అంత ధైర్యంగల అక్క బావ విషయంలో బేలయిపోతుంది ఎందుకో అర్థం కాదు. రేవతిలో విశ్లేషణా చాతుర్యానికి రంగారావు ఆమెను మనసులో అభినందించుకున్నాడు

నీడ

"రాత్రి ఒంటరిగా స్త్రీ ప్రయాణించడం అంటె చాలా గొప్పవిషయం సామాజికంగా సమస్యలు ఎదురుకావా? బ్రాందీషాపులోకి వెడితే యిబ్బందులు ఏమీ వుండవా?" రంగారావు యింటర్వ్యూచేసే ధోరణిలో అడిగాడు.

కాత్యాయని రేవతికేసి చూసింది

"అలా చూడకు అక్కా! నిన్ను తక్కువచేసి మాట్లాడాలనికాదు నావుద్దేశ్యం నీ కథ విని కొంతమందయినా జాలిపడతారు, సానుభూతి చూపిస్తారు ఈ జాలి, సానుభూతి నీ జీవితానికి సుఖం తీసుకురాగలవా? అన్పించవచ్చు నీకు నీ కథ సమాజంలో కొంతమందికయినా జేరుతుంది. నిరాశతో తాగుడువంటి దురభ్యాలకు మనిషి వెళ్ళకుండా చేయవచ్చు లేదా అలాంటి దురభ్యాసాలు గలవారు మారవచ్చు"

'మీరు చెప్పింది నిజం మీ కథవల్ల తప్పక సామాజిక ప్రయోజనం వుంటుంది చెప్పండి" రంగారావు ప్రోత్సహించాడు

"సమాజం కత్తుల బోనువంటిది. ఏ మాత్రం అజాగ్రత్తగా ప్రవర్తించినా గాయం తప్పదు. తలవొంచుకుని పరిసరాలు గమనించనట్లుగా ఉంటూనే పరిసరాలు గమనించుకుంటూ జీవితం గడపాలి. అలవాటు ప్రదేశాల్లో షమస్యలకన్నా కొత్త ప్రదేశాల్లో కొత్త కొత్త సమస్యలు ఎదురవుతూ ఉంటాయి. అందుకే జనసమర్దంగల్ల ప్రాంతాల్లో మసలుతూ ఉండాలి" కాత్యాయని అనుభవాన్ని అందంగా మలచి చెబుతోంది.

'నాభర్తకు విడాకులు ఇవ్వమని చాలామంది సలహా ఇస్తున్నారు, నా మీద చూపించే సానుభూతికి నాకు ఎంతో సంతోషంగా ఉంది నా చెల్లి అనుభవాలు వేరు ఆమె జీవితం వేరు. ఆమె గురించి ప్రస్తావించను. నేను బాధపడి అవస్థ పడుతున్నానని ఆమె ఆవేదన"

నా అనుభవాలు చెబుతాను వినండి

"ఏ రాయి అయినా గుళ్లో ఉంటే ప్రజలు దేముడని కొలుస్తారు దండం పెడతారు అదే గుడి బయట ఉంటే మామూలు రాయిగా ఉంటుంది కాళ్లతో తొక్కుతారు, ముళ్ల కంచెల్లోకి విసిరేస్తారు ఎవరి ఇష్టం వచ్చినట్లు వాళ్లు ఉపయోగిస్తారు."

నా కుటుంబాన్ని గమనించిన ఒక ఆసామీ నన్ను ఎంతో సానుభూతితో పలకరించాడు. చాలా గౌరవాన్ని ప్రదర్శించాడు. ఆయన వాత్సల్యానికి నేను పొంగిపోయాను. కనిపించినప్పుడు ఎంతో ఆదరంగా కుశల ప్రశ్నలు వేసేవారు. నా తండ్రి చూపించలేని ఆదరణ ఆయన దగ్గర ఉందని నమ్మాను. ఆయనకు నాకు ముప్పయి సంవత్సరాలు తేడా ఉంది

ఒక రోజున నా సంసార జీవితం గురించి ప్రస్తావిస్తూ సుఖపడలేని భర్తతో సంసారం ఎందుకు?? నీకు సంసార సుఖం నేను సమకూరుస్తాను అంటూ మనిషి లోతుకందని లోతుల్లో ఉన్న ఆయన స్వార్థాన్ని బయట పెట్టాడు. కాత్యాయని ఆగిరిది. కాసేపు మౌనంగా ఉంది. అంతా నిశ్శబ్దం

మళ్లీ ప్రారంభించింది.

ఒక రిప్రజెంటేటివ్‌తో సేల్సు సమయంలో పరిచయం అయ్యింది అతడు మంచివాడు. నాకన్నా నాల్గయిదేళ్లు పెద్ద ఉంటాడు. నేనంటే చాలా ఇష్టం అని చెప్పాడు. నా అభిప్రాయం అడిగాడు. ఎందుకని అడిగాను చెప్పలేదు. కన్పించినప్పుడు ఎంతో ఇష్టంగా తనహద్దుల్లో ఉండి నాతో ప్రవర్తించేవాడు

'మీ తాగుబోతు భర్తతో ఎలా సంసారం చేయగల్గుతున్నారు. నాకు విచారంగా ఉంది మీ జీవితం చూస్తూ ఉంటే' అన్నాడు

'ఏమి చెయ్యమంటారు?' అడిగాను.

ధైర్యం చేసి అన్నాడు "మీరు, నేను కలిసి జీవిద్దామా?"

'అంటే' అని అడిగాను

'స్నేహితుల్లా. మీకు ఏ లోటు రానియ్యను. పువ్వుల్లో పెట్టి పూజించుకుంటాను."

నేను నవ్వాను

'ఎందుకు నవ్వుతున్నారు?' అడిగాడు.

"మీకు ధైర్యం ఉంటే నన్ను పెళ్లి చేసుకుని భార్యగా తీసుకు వెళ్లండి" నేను అన్న మాటకు అతడు అదోలా అయిపోయాడు. మళ్లీ కన్పించలేదు. 'నేను అంటే అతనికి ఇష్టం. బాగుంది. సమాజానికి భయపడి నన్ను పెళ్లి చేసుకోలేదు"

'పోనీ పెళ్లి చేసుకోవద్దు. నన్ను జేరదీసి నా మంచి చెడ్డలు చూస్తూ నన్ను కాపాడగల మొగవాడు ఎవరైనా ఉంటే నేను వెళ్లిపోతాను. ఎవరైనా చూపగలరా నా వయస్సు, నా అందం, ఆకర్షణ ప్రతి మగవాడికి ఇష్టం అనిపించవచ్చు. నేను తొందరపడి నిర్ణయం తీసుకుంటే ఏమవుతుంది?"

చెప్పండి రంగారావుగారు ఇది జీవితం. సినిమాకాదు. తాళితెంపి ముఖాన పడేసేందుకు.

భర్తను వదలిన స్త్రీ అంటే ఆమె పరిస్థితి ఈ సమాజంలో ఎలా ఉంటుంది. సానుభూతి, జాలి ఇవన్నీ తమాషాలు. వీటి వెనుక స్వార్థం గడపదాటనంత వరకూ విలువ."

ప్రస్తుతం నా భర్త తాగుడు మైకంలో నన్ను కొడుతున్నాడు మైకం లేనప్పుడు నేనంటే పంచ ప్రాణాలు. నిరాశ, నిస్పృహల పర్యవసానంగా వ్యసనానికి బానిస అయ్యాడు వీలయినంత వరకూ అతన్ని బాగు చెయ్యాలని నా ప్రయత్నం.

అతని మానాన అతన్ని వదలి నాకు తోచినట్లు నేను ప్రవర్తిస్తే అతని ప్రాణానికి ముప్పుకల్గితే దానికి నైతిక బాధ్యత ఎవరు వహిస్తారు. అతను నా భర్త. అందుకే దూరం నుండి రాళ్లు విసరి నన్ను కొడదామని ప్రయత్నిస్తున్నారు

నా భర్త నీడలోంచి నేను బయటకు వస్తే అందరూ దగ్గరకువచ్చి రాళ్లతో నన్ను బాదేస్తారు. నేను పిరికి దానను కాదు కాని సమస్యకు పరిష్కారం విడాకులని నేను భావించను

ఈ సమాజం స్త్రీ కూడా మనిషేనని ఆమె విలాస వస్తువుకాదని, ఆమెకు మనసు, అభిప్రాయాలు, అభిమతాలు ఉంటాయని ఎప్పుడైతే గుర్తించి ఆమెను గౌరవించగల్గుతుందో అప్పుడు తాగుబోతు భర్తకు దూరంగా ఒంటరిగా బ్రతకగలను.

అంతవరకూ ఆ భర్త నీడలో నా జీవితం సాగించక తప్పదు సలహాలు ఇచ్చినంత సులువుగా పనులు చెయ్యలేం

రంగారావు, రేవతి కాత్యాయని మాటలు వింటున్నారు అక్కలో కన్పించని అక్కను చూసి రేవతి ఆవేశం చల్లారిపోతోంది. కాత్యాయనిలాంటి స్త్రీల జీవితాలు వెనుక ఎలాంటి పచ్చి నిజాలుంటాయో సమాజానికి తెలియ జెప్పాలని రంగారావు నిశ్చయించుకున్నాడు. □